


కథ

# డబ్బుకాటు

ప్రఫుల్లచంద్ర

మనం దోమలకు భయపడతాం. దోమకాటువల్ల వచ్చే రోగాలకు భయపడతాం. రోగవిముక్తి కోసం తహతహలాడుతాం. కానీ దబ్బుకి భయపడం. డబ్బుకాటుకి భయపడం. ఆ కాటువల్ల సంక్రమించే పరిణామాలకు భయపడం. ఇంకా ఇంకా కావాలనుకుంటాం.

ఆ ఫోటో చూడండి. ఎంత హుందాగా, ఎంత గౌరవంగా, ఎంత రాజసంగా కనిపిస్తున్నాడో! ఆయనొక భారతీయ ఐటి దిగ్గజం! ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత ప్రమాణాలకు, నియమాలకు పేరుపడిన సంస్థ యజమాని.

హఠాత్తుగా రాజకీయ నాయకులతో చేయికలిపాడు. అంతే. డబ్బు కాటేసింది. ఇంకా ఇంకా డబ్బు పోగేయాలనుకున్నాడు. తప్పులు చేశాడు. ఆ తప్పులు కప్పిపుచ్చడానికి మరిన్ని తప్పులు చేశాడు. ఇంకా డబ్బు కావలసి వచ్చింది. ఇంకా ఇంకా కావలసి వచ్చింది. చివరకు ఆ డబ్బు తేలేక తప్పుఒప్పుకొని దేశానికి తలవంపులు తెచ్చి జైలులో కూర్చోవలసి వచ్చింది.

పరువుపోయింది. ప్రతిష్ఠ పోయింది. ఆయన్ని దైవంగా కొలిచే అభిమానులు, సిబ్బంది దూరం అయ్యారు. ఆయనపై నమ్మకంతో కంపెనీ షేర్లు కొన్న సామాన్యులు ఛిద్రం అయారు. డబ్బుకాటేస్తే అంతే మరి!

పాన్పుమీద విలాసంగా దొర్లుతూ రెండు పేజీల ఆ వ్యాసంలో పావుపేజీ చదివి విసుగుగా పత్రికను పడేసింది ప్రణవి. పాన్పునిండా చెల్లాచెదురుగా పడివున్న పత్రికల్లో అదీ చేరింది.

"నెల నెలా పత్రికల కోసం వెయ్యి రూపాయిల ఖర్చు!" అని ఘనంగా చెప్పుకోవడం ఆమెకు సరదా. కానీ ఏ పత్రికనూ ఆమె పూర్తిగా చదవదు. కొద్దిగా రుచి చూసి పడేస్తుంది.

మేడమ్‌కి యాపిల్ జ్యూస్ తెచ్చి ఇచ్చి పాన్పుమీద పడివున్న పత్రికలన్నీ తీసి బీరువాలో దేని స్థానంలో దాన్ని సర్ది పెట్టింది హౌస్‌కీపర్ మాధురి.

పవళింపు పోజు చాలించి పాన్పుమీద లేచి కూర్చుని జ్యూస్ తాగుతూ విశేషాలేమిటని అడిగింది ప్రణవి. మంచం దగ్గరగా కుర్చీని లాక్కుని కూర్చుంది మాధురి. పేరుకి హౌస్ కీపర్‌గాని ఆమెను స్వంత చెల్లి లాగా చూసుకుంటుంది ప్రణవి.

ఆమె అందమైనది. తెలివైనది. బియస్సీ చదివింది. చక్కగా మాట్లాడుతుంది. పత్రికలు చదివి మేడమ్‌కి ముఖ్యాంశాలు చెప్పడం ఆమె డ్యూటీలో ఒక భాగం!

చిరంజీవి, యన్టీఆర్‌ల రోడ్‌షోల గురించి వివరించి, క్రికెట్‌ని టచ్ చేసి, చివరగా చెప్పబోయే అంశం చాలా ముఖ్యం అన్నట్లు పోజుపెట్టి చెప్పింది.

కన్నకూతురుతో లైంగికంగా కలిస్తే అదృష్టం కలిసి వస్తుందని ముంబైలో ఒక వ్యాపారికి ఒక తాంత్రికుడు చెప్పాడట. పన్నెండేళ్ల కూతురుతో ఆ రాక్షసుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అందుకు భార్య సహకరించింది. ఈ వ్యవహారం తొమ్మిదేళ్లుగా సాగుతున్నా అదృష్టం కలిసిరాకపోవడంతో రెండో కూతురుతోనూ సంబంధం పెట్టుకోమని తాంత్రికుడు సలహా ఇచ్చాడు. దానితో ఒళ్లుమండిన పెద్దకూతురు తెగించి బంధువులకు ఈ విషయం చెప్పింది. వాళ్లు పోలీసులకు రిపోర్ట్ చేశారు. ఫలితంగా వ్యాపారి, అతని భార్య, తాంత్రికుడు జైలు పాలయ్యారు.

ఆ విషయం గురించే ఆలోచిస్తూ ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు.

కన్నకూతుర్ని చెరచిన ఆ మానవమృగం సంగతి అటుంచితే అతని భార్య ప్రోత్సహించటం ఏమిటి అని ఆవేదన చెందింది మాధురి.

"పెళ్లయితే అంతే. ఏ భార్యా భర్తని ఎదిరించలేదు. నీకు పెళ్లయితే తెలుస్తుంది" అంది ప్రణవి విషణ్ణంగా.

పురాణకాలం, పతివ్రతలు మీదకు టాపిక్ మళ్లింది.


నీతిమాలిన తన భర్త సూర్యోదయం కాగానే మరణిస్తాడని తెలుసుకున్న ఒక పతివ్రత తన పాతివ్రత్యంతో సూర్యోదయం అవకుండా అడ్డుకుందని ఒక పురాణ గాథ. ఎన్నో అకృత్యాలు చేసిన జలంధరుని, ఆయన భార్య పాతివ్రత్యం కాపాడిందని మరో గాథ.

"భర్త ఎంత నికృష్టుడైనా, అతనివల్ల సాటి స్త్రీలకు, సమాజానికి ఎంత చెరుపు కలుగుతున్నా భార్య అతనినే కాపాడుతూ ఉండాలా? అతనిని సరిదిద్దడానికి, అవసరం అయితే శిక్షించడానికీ ఆమె పూనుకోవద్దా? ఆధునిక స్త్రీ కూడా అలనాటి పురాణ కాల స్త్రీల మాదిరిగా భర్త దౌష్ట్యానికి తలఒగ్గి పడి ఉండాలా? సిగరెట్లు, మద్యంలాంటి దురలవాట్లని మానమని భర్తని కట్టడి చేసే భార్య, అక్రమార్జన జోలికి పోవద్దని భర్తని ఎందుకు నిలదీయలేకపోతున్నది? అలాంటి ఆర్జన సమకూర్చే సుఖాల పట్ల మోజు వల్లనా? ఆలోచిస్తోంటే విజయం సాధించిన ప్రతి మగాడి వెనక ఒక స్త్రీ వున్నట్లే పతనం చెందిన ప్రతి మగాడి వెనకా అతనిని కట్టడి చేయలేని భార్య ఉంటుంది!"

ఆవేశంగా, అనర్గళంగా మాధురి చెరిగి పారేస్తోంటే విస్ఫారిత నేత్రాలతో చూస్తూ వుండిపోయింది ప్రణవి. ఆమెకు దిగ్భ్రాంతిగా ఉంది. మాధురి ఎప్పుడూ ఇంత ఆవేశంగా మాట్లాడలేదు. ఆమె చెప్పేది నిజమే అనిపిస్తోంది ప్రణవికి.

విదేశీయులెంతో ఘనంగా పొగిడే భారతీయ కుటుంబ వ్యవస్థలోనే ఏదో మౌలిక లోపం ఉందనిపిస్తోంది.

కొడుకు బయట ఎన్ని వెధవ్వేషాలేస్తూ తిరిగినా, తల్లిదండ్రులు ముఖ్యంగా తల్లి వాడిని వెనకేసుకు



వస్తుంది.

వాడెందరు అమ్మాయిల జీవితాలు నాశనం చేసినా వాడికి అండగా వుంటుంది. అందరి ఎదుటా మా అబ్బాయి బుద్ధిమంతుడని పొగడుతుంది.

తొంభైశాతం మహిళలు స్వంత కూతురెంత చుప్పనాతిగా ప్రవర్తించినా వెనకేసుకొచ్చి కోడలెంత వినయ విధేయతలు ప్రదర్శించినా రాచి రంపాన పెడుతూ ఉంటారు. ఇదేం అన్యాయమని ఏ కూతురూ తల్లిని నిలదీయదు. తను కోడల్ని వేధిస్తూ తన కూతురికి మాత్రం అత్తగారి ఆరళ్లుండకూడదని ఆ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసి కూతురుచేత వేరింటి కాపురం పెట్టించాలని ఆరాటపడుతుంది.

ఇతరుల అవినీతిని ఎత్తిచూపడంకన్నా ప్రతి వ్యక్తి తన కుటుంబ సభ్యులు చేసే అవినీతిని, అధర్మాన్ని గుర్తించి, ప్రశ్నించి అరికట్టగలిగితే కుటుంబాలు బాగుపడతాయి. ఊళ్లు బాగుపడతాయి. దేశమే బాగుపడుతుంది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "మేడమ్! నేనొక మాట అడగనా? బాధపడరు కదా!" గంభీరంగా అంది మాధురి.

ఏమిటది అన్నట్లు చూసింది ప్రణవి.

"సార్‌గారు ఇంత ఖరీదైన ఇల్లు, ఫర్నిచర్, హంగులు న్యాయంగానే సంపాదించారా? అక్రమార్జన అస్సలు లేదా? ఈ విషయం మీరెప్పుడైనా ఆలోచించారా? ఆయన్ని అడిగారా?"

స్టెన్‌గన్ లోంచి తూటాల్లాగా దూసుకొస్తున్న ప్రశ్నలకు ఉక్కిరిబిక్కిరై కాసేపటికి తేరుకొని ప్రణవి చూసేసరికి అక్కడ మాధురి లేదు. ఆమె మాటతీరు ప్రణవిని ఎంత అతలాకుతలం చేసిందంటే వెంటనే ఆమె మాధురిని వెదుకుతూ గార్డెన్‌లోకి వెళ్లింది.

అక్కడ సిమెంట్ బెంచిమీద కూర్చుని వుంది మాధురి. వెళ్లి ఆమె ప్రక్కనే కూర్చుంటూ "సార్ గురించి ఏమైనా చెడుగా విన్నావా?" అని అడిగింది ప్రణవి. 'మీకు తెలియదా' అన్నట్లు చూసి తలదించుకుంది మాధురి.

నిజం చెప్పమని ప్రణవి మరీ మరీ బలవంతం చేయగా-

"సార్‌గారికి ఓ లేడీడాక్టర్‌తో కాంటాక్ట్ ఉందని చెప్పుకుంటారు. సరే, అది వ్యక్తిగత విషయం కాని..." మేడమ్‌గారి ప్రతిస్పందన కోసం అన్నట్లు ఆగి ఆమెవైపు చూసింది మాధురి.

మబ్బులు మూసేసిన పాలరాతి విగ్రహంలాగా ఉందామె.

"కానీ గత సంవత్సరం నుంచి సార్‌లో బాగా మార్పు వచ్చింది మేడమ్! కమీషన్ల కోసం అనవసరం అయిన టెస్ట్‌లు చేయించి మందులు కొనిపించడం ఎక్కువైంది. అవసరం లేకపోయినా ఆపరేషన్లు చేయడం, శరీర భాగాలు అమ్ముకోవడం..." మాధురి మాట పూర్తికాకముందే-


జోరుగా వచ్చిన కారు సడన్‌బ్రేక్‌తో కీచుమంటూ గేటు వద్ద ఆగడం, గూర్ఖా గేటు తెరవగానే లోనికి దూసుకొచ్చిన కారులోంచి సార్ కంగారుగా దిగి హడావుడిగా ఇంటిలోకి దూసుకుపోవడం క్షణాల్లో జరిగిపోయాయి.

అంతకంటే దిగ్భ్రాంతికరం ఏమంటే - కారు వెనక తరుముతూ సుమారు వందమంది దూసుకొచ్చి గేటు తెరవమని గూర్ఖాతో తగువుపడడం, కొందరు "ఒరేయ్ డాక్టరూ! బయటకు రారా" అని అరుస్తూ ఉండడం,

కొందరు కాంపౌండ్ గోడ దూకి లోనికి రావడానికి ప్రయత్నిస్తూ ఉండడంతో భయకంపితులైన మాధురి, ప్రణవి ఇంటిలోకి పారిపోయి తలుపు మూసేశారు.

హాలులో భయ విహ్వలంగా గజగజ వణికిపోతూ నిలబడిపోయిన డాక్టర్ బెడ్‌రూంలో దూరి తలుపు మూసివేశాడు.

బయట నిమిష నిమిషానికీ గోల ఎక్కువ అవుతోంది. అరుస్తున్నారు. తిడుతున్నారు. రాళ్లు రువ్వుతున్నారు. కిటికీ అద్దాలు భళ్లు భళ్లున విరుగుతున్నాయి. మాధురి, ప్రణవిల గుండెలు ఝల్లు ఝల్లు మంటున్నాయి.




మాధురి ధైర్యం కూడదీసుకొని పోలీసులకు ఫోన్ చేసింది.

గూర్ఖాని నెట్టేసి గేటు తెరుచుకొని జనం ప్రాంగణంలో ప్రవేశించారు. తలుపులు దబదబ బాదుతూ అరుస్తున్నారు. బర్ బర్ మని బజర్ నొక్కుతున్నారు. ప్రాణాలు అరచేత పట్టుకొని పోలీసుల రాక కోసం బితుకు బితుకు మని చూస్తూ ఉండిపోయారు ప్రణవి, మాధురి.

పావుగంటలో వచ్చిన పోలీసులు జనాల్ని అదుపులో పెట్టారు.

మాధురి తలుపు తెరవగా లోనికొచ్చిన ఇన్‌స్పెక్టర్ జరిగింది చెప్పాడు.

"మేడమ్! డబ్బుకి ఆశపడి డాక్టర్‌గారు చేసే నేరాలన్నింటిని చూసీచూడనట్లు వదిలేశానింతవరకూ. ఇప్పుడీ కేసు జటిలమైంది. ఒకామె కిడ్నీ తొలగించి అమ్ముకున్నారు. ఆమె చనిపోయింది. మన కర్మకాలి ఆమె మినిస్టర్‌గారి పి.ఏకి బంధువట. ఇప్పుడు పిఏతో బాటు మినిస్టర్‌గారే రంగంలోకి దిగి డాక్టర్‌ని అరెస్ట్ చేయకపోతే పోలీసుల భరతం పడతానని రంకెలేస్తున్నాడు. అరెస్ట్ చేయకతప్పదు" అంటూ బెడ్‌రూం తలుపుతట్టి డాక్టర్ బయటకు రాగానే అరెస్ట్ చేసి తీసుకుపోయాడు.

బయట జనాలు హర్షాతిరేకంతో ఈలలూ, చప్పట్లూ, కేకలూ- ధ్రమాన్పడిపోయింది ప్రణవి.

దూసుకొచ్చిన రాళ్లను, విరిగిపడ్డ గాజుపెంకుల్ని ఎత్తిపారబోసి మేడమ్ వద్ద కొచ్చింది మాధురి. మాధురి ఆమె కన్నీళ్లు తుడిచి ఓదార్చగా ఆమెలోశోకం ఒక్కసారిగా భళ్లుమంది. గోడు గోడున ఏడుస్తూ " ఏం చేయమంటావే! ఇప్పుడు నన్నేం చేయమంటావ్!" అని శోకించింది.

కాసేపు ఆలోచించి-


"రెండే మార్గాలు మేడమ్! మన పురాణ కాల మహా పతివ్రతల్లాగా పతియే ప్రత్యక్ష దైవంగా భావించి లక్షలు ఖర్చుపెట్టి భర్తని రక్షించుకొని ఆయనెంతమందిని చంపితే నాకేం అనుకుంటూ ఆయన కుమ్మరించే అక్రమార్జనతో విలాసవంతంగా హాయిగా ఉండడం..." కాసేపాగింది మాధురి.

ఆ స్వరంలోని కసి, తీవ్రత విని విస్తుపోయింది ప్రణవి. తన మాటలు తనకే కర్కశంగా వినిపించాయి కాబోలు గొంతు సవరించుకొని మార్దవంగా "రెండోది న్యాయమార్గం. బహు కఠినం. అందుకు దృఢచిత్తం కావాలి. చట్టాన్ని తన పని చేసుకోనివ్వాలి. సార్ చేసిన నేరాలకు తగిన శిక్ష అనుభవించాలన్న న్యాయానికి బద్ధులై ఉండాలి. ఆయన జైలునుంచి వచ్చాక శేషజీవితం సక్రమంగా నడిచేటట్లు మార్గదర్శనం చేసే ఆత్మబలం కావాలి. అవి మీకున్నాయా?" అని అడిగి-

"నా కథ మీకింతవరకూ చెప్పలేదు. నిజానికి నేను మా నాన్నగారి లంచగొండితనాన్ని నిరసించి ఇంట్లో తగువుపడి ఇలా వచ్చేసి మీ ఇంట్లో హౌస్‌కీపర్‌గా ఉన్నాను. ఏదో సాధించానన్న ఆత్మతృప్తి ఆనందం నాకున్నాయి. మీకలాంటి ఆత్మతృప్తి కావాలా? లేక ఆత్మద్రోహం చేసుకుంటూ భర్త అక్రమార్జనతో రక్తపు కూడు తింటూ విలాసాల్లో తేలిపోవాలనుకుంటున్నారా? నిర్ణయం మీదే" అంది మాధురి మృదువుగానే అయినా దృఢంగా.

ఏదో దృఢ నిర్ణయం తీసుకున్నట్టు ప్రణవి ముఖం ఆత్మతృప్తితో వెలిగిపోయింది!

○



## ఇలియానా మజాకా?

ఇలియానా గనక ఏ షూటింగ్ లేకుండా ఇంట్లో వుంటే ఇంటి పనీ, వంట పనీ అంతా తనొక్కతే చేసేస్తుందిట. సాధారణంగా వాళ్ల మమ్మీనే అన్ని పనులూ చేసుకుంటుందిట. అయితే ఇలియానా ఇంట్లో వుంటే తల్లిని ఎంచక్కా రెస్టు తీస్కోమని అలా పక్కన కూర్చోబెట్టి అన్ని పనులూ చేసిపారేస్తుందిట. పనిమీద తనకి గల శ్రద్ధకి వాళ్ల అమ్మ- తన మిగతా కూతుళ్ల (ఇలియానా అక్క, చెల్లి)కి చివాట్లు వేస్తుంటుందని ముసిముసిగా చెబుతుంది ఇలియానా.